


ఈ కొద్దిపాటి పని పూర్తి చేస్తే కృష్ణా జలాలు శ్రీశైలం నుంచి కురుమూర్తిరాయ రిజర్వాయర్ వరకు (కరివెన) తరలివెళ్తాయి. ఆ మేరకు పనులన్నీ కేసీఆర్ హయాంలోనే పూర్తయ్యాయి.



అంజనాద్రి రిజర్వాయర్ (నార్లాపూర్) నుంచి వీరాంజనేయ (ఏదుల) రిజర్వాయర్‌కు నీళ్లను తరలించే హెడ్‌రెగ్యులేటర్




ఉద్దండాపూర్ రిజర్వాయర్ నుంచి డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే టెండర్లు పిలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. ఇలా కాకుండా కాల్వలను పూర్తి చేసి ఉంటే దాదాపు 8 లక్షల ఆయకట్టుకు నీళ్లు వచ్చేవి.



వీరాంజనేయ, వెంకటాద్రి రిజర్వాయర్లను కల్వకుర్తి ప్రధాన కాల్వతో అనుసంధానం చేశారు. ప్రస్తుతం కల్వకుర్తి కాల్వ సామర్థ్యం సరిపడా లేనందువల్ల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీళ్లు ఇవ్వలేక పోతుంది. ఇప్పటికే పనులు పూర్తి చేసి పాలమూరు రిజర్వాయర్లను గనుక నింపి ఉంటే ఇప్పటికే పనులు పూర్తయి సిద్ధంగా ఉన్న ఈ కెనాల్ ద్వారా కల్వకుర్తి ప్రధాన కాల్వకు నీళ్లు తరలించే వీలుండేది. ఆయకట్టుకు భరోసా దక్కేది?

# పాలమూరుపై పగ.. కల్వకుర్తికి దగా

మొదటిపేజీ తరువాయి...

మరోవైపు పాలమూరు మోటర్లు మాత్రం ఆన్ కావడం లేదు. రిజర్వాయర్లలో నీటిని నింపుకునే వెసులుబాటు ఉన్నా, చిన్నపాటి పనులు పెండింగ్‌లో పెట్టి ప్రభుత్వం తమాషా చూస్తున్నది. ప్రధానంగా పాలమూరు ప్రాజెక్టుతో కల్వకుర్తి ప్రాజెక్టు కింద రెండు లక్షల ఎకరాలకుపైగా స్థిరీకరణ చేసేందుకు అనుసంధాన తూములు ఉన్నప్పటికీ, నీటిని ఎత్తిపోయకపోవడంతో కల్వకుర్తి కింద సాగునీరు సరిపోక రైతాంగం అల్లాడిపోతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే కాల్వలకు సైతం టెండర్లు పూర్తికాగా, అధికారంలోకి రాగానే రేవంత్ సర్కారు వాటిని రద్దు చేసింది. దీంతో, ఒకవైపు పొలాలకు అందాల్సిన సాగునీటికి మార్గం లేక, ఇటు ఏడాదికిపైగా జాప్యం కారణంగా అంచనా వ్యయం వెయ్యి కోట్లకుపైగా అదనంగా పెరిగిపోయింది. ఇలా పాలమూరును పక్కన బెట్టి, కల్వకుర్తిని ఎండబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 'పాలమూరుకు మీరేం చేశారు?' అంటూ బీఆర్‌ఎస్‌ను ఎదురు ప్రశ్నించడం ఓ విడ్డూరం.

### నాడు కేసులు.. నేడు నిర్లక్ష్యం

పాత పాలమూరుతోపాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 12.3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి గ్రహణం పట్టుకున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఇది పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్‌కు చెందిన నేతలు న్యాయస్థానాలు, గ్రీన్‌ట్రిబ్యునల్స్‌లో వేసిన కేసులతో ఆ చిక్కుముళ్లు విప్పేందుకే చాలాకాలం పట్టింది. ముఖ్యంగా ఈ ప్రాజెక్టు పనులు చేపడుతున్న ప్రాంతంలో పులుల సంచారానికి ఇబ్బందులు ఉన్నాయంటూ కాంగ్రెస్ నేతలు గ్రీన్‌ట్రిబ్యునల్‌లో అడ్డుపుల్ల వేసి పనులు ముందుకు సాగకుండా తీవ్ర ప్రయత్నం చేయడంతో కేసీఆర్ ప్రభుత్వం ఆ సమస్యలను అధిగమించేందుకు అనేక పాట్లు పడాల్సి వచ్చింది. అయినప్పటికీ, కేవలం తాగునీటి కోసమే పనులు చేపట్టాలంటూ గ్రీన్‌ట్రిబ్యునల్ ఆంక్షలు కొనసాగించింది. వీటన్నింటినీ ఎదుర్కొంటూనే కేసీఆర్ ప్రభుత్వం సింహభాగం పనులు పూర్తి చేసి, నీటి ఎత్తిపోతలు కూడా ప్రారంభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ వేగాన్ని కొనసాగించి ఉంటే, ఇప్పటికే ప్రాజెక్టు కింద ఆయకట్టుకు సాగునీరు అందడంతో పాటు కల్వకుర్తి ప్రాజెక్టు కింద కూడా ఆయకట్టు స్థిరీకరణ జరిగేది. కానీ, కేసీఆర్‌కు పేరు వస్తుందనే దుగ్ధతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పనులను అటకెక్కించింది. పాలమూరును గోస పెడుతున్నది.

### విద్యుత్తు కనెక్షన్ ఇచ్చే గతి లేదు

కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులో భాగంగా 65.17 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఐదు రిజర్వాయర్ల పనులను దాదాపుగా పూర్తి చేసింది. ప్రాజెక్టులో నాలుగుచోట్ల నీటిని ఎత్తిపోయాల్సి ఉన్నది. ఇందులో భాగంగా శ్రీశైలం నుంచి నీటిని ఎత్తిపోసే నార్లాపూర్ పంపుహౌజ్ వద్ద ఆసియాలోనే అతి పెద్ద సామర్థ్యం ఉన్న 145 మెగావాట్ల మోటర్లు ఎనిమిది ఏర్పాటు చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఇందులో రెండు మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోశారు. ఆ తర్వాత నిర్మాణమైన మరో మూడు పంపుహౌస్‌లలో నాలుగు చొప్పున మోటర్లు సిద్ధంగా ఉన్నాయి. కానీ, ఆయా పంపుహౌజ్‌ల పరిధిలో ఉన్న విద్యుత్తు సబ్‌స్టేషన్లకు కరెంటు సరఫరా ఇంకా ఇవ్వకపోవడంతో ఈ మోటర్ల డ్రైరన్ కూడా నిర్వహించలేని దుస్థితి నెలకొన్నది. దీంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం గత 16 నెలల్లో గతంలోని పనుల వేగాన్ని కొనసాగించి ఉంటే, శ్రీశైలం నుంచి కృష్ణాజలాలు జడ్చర్ల పరిధిలోని ఉద్దండాపూర్ వరకు పరుగులు పెట్టేవి. అదేవిధంగా కాల్వల పనుల టెండర్లు కూడా పూర్తయినందున భూసేకరణ పూర్తి చేసి, వాటి నిర్మాణాన్నీ చేపడితే దశాబ్దాలుగా సాగునీటికి నోచుకోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని లక్షలాది ఎకరాలు ఇప్పుడు పచ్చని మాగాణంలా తయారయ్యేవి.

- శ్రీశైలం జలాశయం ఫోర్‌షోర్ నుంచి నార్లాపూర్ (అంజనగిరి) రిజర్వాయర్‌లోకి కృష్ణాజలాలను ఎత్తిపోసేందుకు నాలుగు మోటర్లు సిద్ధంగా ఉన్నాయి. ఈ రిజర్వాయర్ పూర్తి నిల్వ సామర్థ్యం 8.52 టీఎంసీలు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే రెండు టీఎంసీల మేర నింపారు. ప్రొటోకాల్ ప్రకారం ఇప్పుడు మరో రెండు టీఎంసీలు నింపే అవకాశం ఉన్నది. తద్వారా నాలుగు టీఎంసీల కృష్ణాజలాలను ఇందులో నిల్వ చేసుకోవచ్చు. గతంలో నీటిని నింపడంతో ఇప్పుడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు బోర్లు, బావుల్లో సమృద్ధిగా నీళ్లు ఉన్నాయి.

- నార్లాపూర్ (అంజనగిరి) రిజర్వాయర్ నుంచి 6.55 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఏదుల రిజర్వాయర్‌లోకి కృష్ణాజలాలు వెళ్లేందుకు దాదాపుగా అన్ని పనులు పూర్తయ్యాయి. కేవలం ప్యాకేజీ-3లో భాగంగా పెండింగ్‌లో ఉన్న సుమారు మూడున్నర కిలోమీటర్ల ప్రధాన కాల్వ పనులు పూర్తి చేయాలి. ఇక్కడ కూడా బ్యాంకింగ్ (రాతి నిర్మాణం) పనులు మాత్రమే చేపట్టాల్సి ఉన్నది. ఈ పనులు పూర్తయితే ఏదుల జలాశయంలో ప్రొటోకాల్ ప్రకారం రెండు, మూడు టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చు. తద్వారా చుట్టుపక్కల కిలోమీటర్ల కొద్దీ బోర్లు, బావులు పుష్కలంగా నీరు పోసేవి.

- ఏదుల (వీరాంజనేయ) రిజర్వాయర్ నుంచి వట్టెం (వెంకటాద్రి) రిజర్వాయర్ వరకు నీటిని ఎత్తిపోసేందుకు నాలుగు మోటర్లు సిద్ధంగా ఉన్నాయి. కాల్వ పనులు, 16.74 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న వట్టెం రిజర్వాయర్ పనులు పూర్తయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి పంపుహౌజ్ వద్ద ఉన్న సబ్‌స్టేషన్లకు కరెంటు సరఫరాను ఇప్పిస్తే ఇక్కడ 4 టీఎంసీల కృష్ణాజలాలను నిల్వ చేసుకునేందుకు వెసులుబాటు ఉన్నది. తద్వారా చుట్టూ భూగర్భజలాలకు జీవం వచ్చేది. కానీ, నార్లాపూర్-ఏదుల మధ్య కేవలం కొద్దిపనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. మూడున్నర కిలోమీటర్ల పనులు అసంపూర్ణంగా ఉన్నందున ఇక్కడిదాకా నీళ్లు రావడం లేదు.

- వట్టెం (వెంకటాద్రి) రిజర్వాయర్ నుంచి 17.34 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న కరివెన (కురుమూర్తిరాయ) రిజర్వాయర్‌కు కూడా కృష్ణాజలాలను తరలించేందుకు పనులన్నీ పూర్తయ్యాయి. వీటి మధ్య జలాల తరలింపు గ్రావిటీ మీదనే ఉంటుంది. ఇప్పటికే కాల్వ పనులు పూర్తయిన నేపథ్యంలో వెంకటాద్రి (వట్టెం) రిజర్వాయర్‌లో నీళ్లు నింపి, దిగువకు గేట్లు తెరిస్తే కృష్ణాజలాలు కరివెన వరకు పరుగులు తీస్తాయి. కానీ, నార్లాపూర్-ఏదుల మధ్య మూడున్నర కిలోమీటర్ల పనులు పెండింగ్‌లో ఉన్నందున ఇక్కడిదాకా నీళ్లు రావడం లేదు.

- కురుమూర్తిరాయ (కరివెన) రిజర్వాయర్ నుంచి ఉద్దండాపూర్ రిజర్వాయర్‌కు కృష్ణాజలాలను తరలించాలి. ఇందుకుగాను ప్రధాన కాల్వ పనులు పూర్తయ్యాయి. ఇక్కడ కూడా చాలా దూరం జలాలు గ్రావిటీపైనే ఉద్దండాపూర్ వైపు వస్తాయి. చివరలో మోటర్ల ద్వారా ఎత్తిపోయాలి. పంపుహౌజ్, మోటర్ల బిగింపు పనులు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 75% వరకు పూర్తయ్యాయి. ఉద్దండాపూర్ రిజర్వాయర్ పనులు రివిట్‌మెంట్ అంటే చివరి దశలో ఉన్నాయి. ఈ 16 నెలల్లో ఆ పనులు పూర్తి చేస్తే కృష్ణాజలాలు 16.03 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న ఉద్దండాపూర్ రిజర్వాయర్‌లోకి వచ్చిపడతాయి. తద్వారా ఏనాడూ సాగునీటి మొహం చూడని ఈ ప్రాంతంలో మూడు టీఎంసీల జలాల నిల్వతో చుట్టూ కిలోమీటర్ల కొద్దీ భూగర్భజలాలు సమృద్ధిగా ఉండేవి.



### 3.5 కి.మీతో 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు జీవం

కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం అంజనగిరి (నార్లాపూర్) నుంచి వీరాంజనేయ (ఏదుల) రిజర్వాయర్ మధ్య పెండింగులో ఉన్న మూడున్నర కిలోమీటర్ల అసంపూర్తి కాల్వ పనులను పూర్తి చేస్తే రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు భరోసా దొరికేది. ఈ పనులను పూర్తి చేస్తే కృష్ణాజలాలు 4 రిజర్వాయర్లలోకి వచ్చేవి. తద్వారా ఆ రిజర్వాయర్ల చుట్టూ కిలోమీటర్ల మేర భూగర్భజలాలు సమృద్ధిగా ఉండేవి. వాటి పరిధిలోని బోర్లు, బావులు నిండు వేసవిలోనూ ఎండిపోకుండా ఉండి, రైతుల పంటలకు భరోసాగా నిలిచేవి. అంతేకాదు, రిజర్వాయర్లలో నీటి నిల్వతో కొత్తగా బోర్లు, బావులను నమ్ముకొని వేలాది ఎకరాల్లో పంటలు పండించుకునేవారు. దీంతో కల్వకుర్తి ఆయకట్టు స్థిరీకరణ జరిగేది.


- వీరాంజనేయ (ఏదుల) రిజర్వాయర్ నుంచి కల్వకుర్తి ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టును స్థిరీకరించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ముందుచూపుతో ఒక తూము ఏర్పాటు చేసింది. 350 క్యూసెక్కుల డిజైన్ డిశ్చార్జితో పూర్తి చేసిన ఈ తూము ద్వారా పాలమూరు-కల్వకుర్తి ప్రాజెక్టు మధ్య ఉన్న 50 వేల ఎకరాల ఆయకట్టు మొత్తం స్థిరీకరణ జరిగేది.
- అదేవిధంగా వెంకటాద్రి (వట్టెం) రిజర్వాయర్ నుంచి కల్వకుర్తి ఆయకట్టు స్థిరీకరణకు కేసీఆర్ ప్రభుత్వం ముందుచూపుతో తూము ఏర్పాటు చేసింది. 1,500 క్యూసెక్కుల డిశ్చార్జితో ఏర్పాటు చేసిన ఈ తూము ద్వారా రెండు ప్రాజెక్టుల మధ్య ఉన్న లక్షన్నర ఎకరాల ఆయకట్టు స్థిరకరణ జరిగేది.

### సమైక్య వివక్షకు నిదర్శనంగా కల్వకుర్తి

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులు వివక్షకు గురయ్యాయనేందుకు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కూడా ఓ నిదర్శనం. టీడీపీ హయాంలో పట్టాలెక్కిన ఈ ప్రాజెక్టు ప్రతిపాదనల్లో తొలుత 2.2 లక్షల ఎకరాల ఆయకట్టును చూపారు. జలయజ్ఞంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టి ఆయకట్టును 3.4 లక్షల ఎకరాలకు పెంచింది. అరకొర పనులతో చేతులెత్తేశారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చిక్కుముళ్లు అన్నీ విప్పి ఏకంగా 40 టీఎంసీల కేటాయింపుతో ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకుగాను ఆయకట్టును 4.6 లక్షలకు పెంచింది. గ్యాప్ ఆయకట్టు కూడా తోడవడంతో ఇప్పుడు కల్వకుర్తి ప్రాజెక్టుపై ఏకంగా ఐదు లక్షల ఆయకట్టు భారం పడింది.

- ప్రాజెక్టులో ఒక స్టాండ్‌బై మోటరు సహా ఐదు మోటర్లు ఉన్నాయి. అంటే నాలుగు మోటర్ల ద్వారా 3,200 క్యూసెక్కులు విడుదల అవుతాయి.
- ఆయకట్టు పెరిగినందున ఐదో మోటర్‌ను నడపాలని అనుకున్నా... కాల్వ మాత్రం 3,200 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతోనే ఉన్నందున ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి.
- పరిస్థితి ఇంత అధ్వానంగా ఉన్నందునే కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో సొంత ఆయకట్టుతోపాటు కల్వకుర్తి కింద రెండు లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు కూడా డిజైన్ చేసింది.
- చిన్న పనుల పూర్తితో కల్వకుర్తి ఆయకట్టు స్థిరీకరణకు అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం ఆయకట్టు రైతులు సమృద్ధిగా సాగునీరు అందక అవస్థలు పడుతున్నారు.

## లోకం పోకడ




మీకు అవమానం ఆరు.. రాజపూజ్యం సున్న

## ఉగాదినాడే 'బార్లా'!

మొదటిపేజీ తరువాయి...

ఇచ్చింది. 'నమస్తే తెలంగాణ' కథనం చూసి ముఖ్యమంత్రి ఉగాది రోజు అని భావించి ఆపితే మినహా.. నూటికి నూరు శాతం నేడు నోటిఫికేషన్ విడుదలకు ఎక్సైజ్‌శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. రెండు నెలల్లో కొత్త బార్లు ఏర్పాటయ్యేలా విధివిధానాలు రూపొందించింది. దరఖాస్తు దాఖలుకు ఫీజు రూ.లక్షగా నిర్ణయించింది. ఒక బార్‌కు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ పద్ధతిలో లైసెన్స్‌లు కేటాయిస్తామని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు. ఇది తొలిదశ నోటిఫికేషన్ మాత్రమేనని, త్వరలో ఎలైట్ బార్లను కలుపుకొని దశల వారీగా మరిన్ని కొత్త బార్లకు అనుమతులు ఇచ్చే అవకాశం ఉన్నదని ఎక్సైజ్ అధికారుల్లో చర్చ జరుగుతున్నది. వీటితోపాటు రాష్ట్రంలో భారీఎత్తున మైక్రో బ్రూవరీల ఏర్పాటును ప్రోత్సహించాలని, ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 మైక్రో బ్రూవరీలనైనా ఏర్పాటుచేయించాలని ప్రభుత్వం ఎక్సైజ్‌శాఖకు టార్గెట్ పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 1,171 బార్లు నడుస్తున్నాయి. ఇవే కాకుండా 89 ఎలైట్‌బార్లతోపాటు హైదరాబాద్, శంషాబాద్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్‌లో 55 పబ్బులు కొనసాగుతున్నాయి. ఈ మొత్తం సంఖ్యను 1,500 వరకు పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు ఎక్సైజ్‌వర్గాలు పేర్కొంటున్నాయి.

## సర్కారుపై భగ్గుమన్న వీఆర్వోలు

- జీపీవో అర్హతలపై ప్రభుత్వం ఉత్తర్వులు
- పాత సర్వీస్ విస్మరణ, పరీక్షపై మండిపాటు
- జీవోలో మార్పులకు డిమాండ్

హైదరాబాద్, మార్చి 29(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారుపై వీఆర్వోలు భగ్గుమన్నారు. గ్రామపాలన అధికారులు(జీపీవో)ల జాబ్‌చార్ట్, నియామక అర్హతలపై ప్రభుత్వం శనివారం జారీచేసిన ఉత్తర్వులను తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ ఉత్తర్వులతో ప్రభుత్వం వీఆర్వోల భవిష్యత్తును త్రిశంకు స్వర్గంలోకి నెట్టిందని మండిపడ్డారు. ఈ మేరకు టీవీఆర్వో జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్, సెక్రటరీ జనరల్ హరాలే సుధాకరరావు తాజా ఉత్తర్వులను ఖండిస్తూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. స్పష్టత లేని జీవో లిస్తూ వీఆర్వోల భవిష్యత్తును సర్కారు ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. ముఖ్యంగా తాజా ఉత్తర్వుల ప్రకారం గత సర్వీసుని పరిగణనలోకి తీసుకోకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్టేనని మండిపడ్డారు. ఇక జీపీవోలుగా నియామకం కోసం అర్హతల పేరుతో పరీక్షలు నిర్వహించాలనే నిర్ణయం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిబంధనలు వీఆర్వోలను అవమానించడానికేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది అధికారుల కుట్రలో భాగంగానే ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని ఆరోపించారు. ఉత్తర్వుల్లో గ్రామాల అకౌంట్స్ బాధ్యతచేర్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఉద్యమబాట తప్పదు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని అహర్నిశలు కష్టపడి పని చేశామని, కానీ అధికారంలోకి వచ్చాక తామే బాధితులుగా మిగిలామని దుయ్యబట్టారు. ఏరికోరి తెచ్చుకున్న ప్రభుత్వం చేతుల్లోనే తాము అన్యాయానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని ఉత్తర్వులను సవరించి వీఆర్వోల పూర్తి సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలని, ఎలాంటి పరీక్షలు లేకుండా అప్పటి వీఆర్వోలందర్నీ జీపీవోలుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఉత్తర్వులను సవరించకుండా ప్రభుత్వం అనాలోచితంగా ముందుకెళ్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

### జాబ్‌చార్ట్ జారీచేసిన ప్రభుత్వం

గ్రామాల్లో 10,954 మంది గ్రామ పాలన అధికారులు(జీపీవో)లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే గత వీఆర్వో, వీఆర్‌ఏలను జీపీవోలుగా నియమించేందుకు, వారి జాబ్‌చార్ట్‌కు సంబంధించిన విధివిధానాలపై శనివారం ప్రభుత్వం జీవో నంబర్ 129 జారీచేసింది. అపాయింట్‌మెంట్, అర్హతలు, విధుల గురించి ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చింది. గతంలో వీఆర్వో, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారి నుంచి ఆప్షన్లు కోరనున్నది.

# కాంగ్రెస్ కక్ష.. బీజేపీ వివక్ష!

- రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్న జాతీయ పార్టీలు
- 'పాలమూరు'పై కేంద్రం సాకులు
- కోర్టు వివాదాలున్నా పక్క రాష్ట్రాల ప్రాజెక్టులకు అనుమతులు
- అప్పర్‌తుంగ, అప్పర్‌భద్ర సాక్ష్యం
- మీనమేషాలు లెక్కిస్తున్న కాంగ్రెస్
- కేసీఆర్‌కు క్రెడిట్ దక్కొద్దనే శీతకన్ను

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : తెలంగాణపై మొదటినుంచీ కేంద్రంలోని బీజేపీ సర్కారు వివక్ష చూపుతున్నది. నిధుల కేటాయింపు, జాతీయ సంస్థల మంజూరు, ఆఖరుకు సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల మంజూరు అంశాల్లోనూ రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నది. ఇందుకు తెలంగాణకు చెందిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకమే నిదర్శనంగా నిలిచింది. కర్ణాటక, మహారాష్ట్రకు సంబంధించిన ప్రాజెక్టులకు అడ్డుచెప్పని కేంద్రం, తెలంగాణ ప్రాజెక్టుకు మాత్రం కుంటిసాకులు చెప్తూ అనుమతులను తిరస్కరిస్తూ వస్తున్నది. కేంద్రాన్ని నిలదీయకుండా, వాదనలను వినిపించకుండా కాంగ్రెస్ సర్కారు మీనమేషాలు లెక్కిస్తున్నది. అనుమతుల సాధనను పూర్తిగా గాలికొదిలేసింది. రెండు జాతీయ పార్టీలూ కలిసి తెలంగాణ ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్నాయి.

### ఏడాదిన్నరగా పెండింగ్ పెట్టి తిరస్కరణ

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి జిల్లాలో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించాలనే లక్ష్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి (పీఆర్‌ఎల్‌ఐఎస్) తెలంగాణ ప్రభుత్వం రూ.35 వేల కోట్ల అంచనాతో 2015లో శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టును ప్రారంభించగానే పొరుగున ఏపీతోపాటు, స్వరాష్ట్రంలో ప్రతిపక్షపార్టీ నేతలు అడ్డంకులు సృష్టించారు. ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎన్జీటీ మొదలు సుప్రీంకోర్టు, ట్రిబ్యునల్, సదరన్ జోనల్ కౌన్సిల్ వరకు అన్ని వేదికలపైనా కుట్రలకు తెరలేపారు. అయినా గత ముఖ్యమంత్రి కేసీఆర్ మొక్కవోని దీక్షతో వాటన్నింటినీ అధిగమించారు. మైనర్ ఇరిగేషన్‌లో వినియోగించుకోని 45 టీఎంసీలు, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలను మొత్తంగా 90 టీఎంసీల నికర జలాలను పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు కేటాయించారు. డీపీఆర్‌ను సిద్ధం చేసి 2022 సెప్టెంబర్‌లో సీడబ్ల్యూసీకి సమర్పించారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ పరిధిలోని ఎక్స్‌పర్ట్ అప్రయిజల్ కమిటీ (ఈఏసీ) అనుమతులకు 34వ సమావేశం నుంచే తీవ్ర ప్రయత్నాలు చేశారు. అనుమతులను ఈఏసీ తిరస్కరిస్తూ అనేక కొర్రీలతో పక్కనపెట్టింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈఏసీ కోరిన విధంగా డాటాను సమర్పించడమేగాక, ప్రాజెక్టు పరిధిలోని కరువు పీడిత ప్రాంతాల పరిస్థితిని వివరించి ఒప్పించింది. దీంతో ఎట్టకేలకు 49వ ఈఏసీ అంగీకరించి అనుమతులు మంజూరు చేయాలని కేంద్రానికి సిఫారసు చేసింది. కానీ, దాదాపు ఏడాదిన్నర నుంచీ కేంద్రం జాప్యం చేస్తూ వచ్చింది. తీరా గత డిసెంబర్‌లో అప్రయిజల్ లిస్ట్ నుంచి పాలమూరు డీపీఆర్‌ను తొలగిస్తున్నట్టు సీడబ్ల్యూసీ వెల్లడించింది. ప్రాజెక్టు అంశంపై ప్రస్తుతం ట్రిబ్యునల్-2 ఎదుట విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో అనుమతులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది.

### మరి ఆ ప్రాజెక్టులకు ఎలా ఇచ్చారు?

ట్రిబ్యునల్ విచారణను సాకుగా చూపుతూ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతులను కేంద్రం తిరస్కరిస్తున్నది. కానీ ట్రిబ్యునల్ అవార్డు అమలులోకి రాకముందే, న్యాయ వివాదాల్లో ఉండగానే కర్ణాటక, మహారాష్ట్ర చేపట్టిన అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులకు గతంలో కేంద్రం అనుమతులిచ్చింది. అప్పర్ భద్ర, అప్పర్ కృష్ణ స్టేజ్-3 (ఆల్మట్టి), అప్పర్ తుంగతోపాటు, ఆ జాబితాలో మహారాష్ట్రకు చెందిన పదుల సంఖ్యలో పలు ఇరిగేషన్ ప్రాజెక్టులున్నాయి. ఇక అప్పర్‌భద్ర, అప్పర్ తుంగ ప్రాజెక్టులదయితే మరీ దారుణం. ఆ ప్రాజెక్టులకు నీటిని కేటాయించాలంటూ కర్ణాటక బచావత్ ట్రిబ్యునల్-1 ఎదుట ప్రతిపాదించింది. కృష్ణాబేసిన్ తీవ్ర నీటి లోటు ఉన్న బేసిన్ అని ట్రిబ్యునల్ వెల్లడించింది. అదీగాక కృష్ణాకు తుంగభద్ర బేసిన్ నుంచే నిరంతరాయంగా నీరు రావాల్సి ఉన్నదని, తుంగభద్రపై ప్రాజెక్టులను నిర్మిస్తే ఆ బేసిన్ నుంచి కృష్ణాకు నీటి రాక తగ్గిపోతుందని, ఫలితంగా దిగువనున్న ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే కే-8లోని తుంగభద్ర సబ్ బేసిన్, ఇతర బేసిన్లకు చేసిన నీటికేటాయింపుల్లో ట్రిబ్యునల్ అనేక మార్గదర్శకాలను సూచించింది. నీటి వినియోగంలో పరిమితులను విధించింది. ట్రిబ్యునల్-1 కర్ణాటకకు గంపగుత్తగా నీటిని కేటాయించినా తుంగభద్ర సబ్‌బేసిన్‌లో ఎక్కడెక్కడ.. ఎంత మొత్తంలో నీటిని వినియోగించుకోవాలనే అంశాలను ట్రిబ్యునల్-1 చాలా స్పష్టంగా నిర్దేశించింది. ఈ నేపథ్యంలోనే అప్పర్ భద్ర, అప్పర్ తుంగ ప్రాజెక్టులకు ట్రిబ్యునల్-1 ఎలాంటి నీటి కేటాయింపులు చేయలేదు. అయితే ట్రిబ్యునల్ గాని, దాని అనుమతితో ఏర్పాటైన అథారిటీ గాని తుంగభద్ర సబ్ బేసిన్‌లో మొత్తం నీటి లభ్యతపై అధ్యయనం చేసి అంచనా వేసిన తర్వాతే నీటిని కేటాయించాలని మాత్రమే ట్రిబ్యునల్- 1 నిర్దేశించింది.

### బేసిన్ అవతలి ప్రాజెక్టులకూ అనుమతులు!

కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి బచావత్ ట్రిబ్యునల్-1 అవార్డు గడువు ముగిసిపోవడం, ఆపై అవార్డులో నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు కృష్ణా జలాల పంపిణీ కోసం 2004 ఏప్రిల్‌లోనే ట్రిబ్యునల్-2 ఏర్పాటైంది. జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ చైర్మన్‌గా ట్రిబ్యునల్ విచారణ చేపట్టింది. కానీ 2005లో ఉమ్మడి ఏపీ సర్కారు చేపట్టిన, బేసిన్ అవతలి ప్రాజెక్టులకు సైతం కేంద్రం అనుమతులిచ్చింది. వైఎస్ జలయజ్ఞంలో అనేక ప్రాజెక్టులు చేపట్టారు. కృష్ణాబేసిన్ నుంచి పెన్నా బేసిన్‌కు జలాలు మళ్లించే హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్), గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్‌ఎస్‌ఎస్), వెలిగొండ, మల్యాల, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ విస్తరణ చేపట్టారు. ఆయా ప్రాజెక్టులపై బేసిన్‌లోని కర్ణాటక, మహారాష్ట్ర సర్కార్లు ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశాయి.